క్లుప్తంగా

నేడు బ్రహ్మంగారి కల్యాణం



విద్యుద్దీపాలంకరణలో బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధ కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కళ్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నారు. కళ్యాణం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. గురువారం ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి ఎనిమిది గంటలకు కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం హరికథ, 11 గంటలకు నరనందిని ఉత్సవం, జాగరణ ఉంటాయి.

అరటిపంట దగ్ధం



నాయునిపల్లెలో కాలిపోయిన అరటిపంట

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన కాశం నరసింహులు, పాములేటి, తోడేటి సుబ్బమ్మ, వెంకటమ్మలకు చెందిన 6 ఎకరాల్లోని అరటిపంటకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. రెండు, మూడు రోజుల్లో అరటికాయలు కోయాల్సి ఉండగా నిప్పంటుకుందని వాపోయారు. పోరుమామిళ్ల ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు యత్నించినా దాదాపు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

సచివాలయం ప్రారంభం



అర్కటవేములలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసి చూపించారని, ప్రజలకు గ్రామంలోనే సేవలు అందే విధంగా జగనన్న ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అర్కటవేముల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే రాచమల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి చాలా వ్యత్యాసం ఉందని, ప్రజలు గమనించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాతపాటి శివనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ది రమణారెడ్డి, శ్రీనివాసులు, ఎంబీ శివశంకర్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, బలరామిరెడ్డి, చిన్న సుబ్బరాయుడు, ఉప ఎంపీపీ నారాయణ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజారామమోహన్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచి

సచివాలయాల ప్రారంభోత్సవాల్లో
ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి



చాగలేరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మబ్బుచింతలపల్లె, పెద్దజూటూరు, చాగలేరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో రూ.22.90 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, మొగమూరు వాగుపై వంతెన, ఏపీ టూరిజం కళ్యాణ మండపం, జగనన్న కాలనీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థను అమలు చేసి దేశానికే జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నష్టపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. నల్లచెరువుపల్లె సమీపాన మొగమూరు వాగుకు వరదలు వస్తే రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడేవారని, రూ.15 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మించి ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అంతకుముందు మబ్బుచింతలపల్లె లో జగనన్న కాలనీని ప్రారంభించి 23 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎంపీ పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు శివాంజలి, లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, అర్జున్, చెన్నారెడ్డి, రంగనాథం, రామాంజనేయ రెడ్డి, పీ.రవిచంద్రారెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. వీరభద్రాలయం

- నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు
- రేపు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు



ఉత్సవాలకు ముస్తాబైన వీరభద్రస్వామి దేవాలయం

చాపాడు : జిల్లాలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శుక్రవారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే మొదటి సారిగా ఈ నెల 2 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తుల కొంగు బంగారంగా పిలువబడే అల్లాడుపల్లెలోని శ్రీ వీరభద్రస్వామిని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి స్వయంగా శిల్పించి ప్రతిష్ఠించారు. అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో శుక్ర, శనివారాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు తెలిపారు. శివరాత్రి రోజైన శుక్రవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి 5 వరకూ రుద్రాభిషేకం, బిల్వార్చన, లలితా సహస్రనామార్చనలు, 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు పాలాభిషేకం, సాయంత్రం 5గంటలకు నంది వాహన సేవ, 6గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. జాగరణకు కోసం వచ్చే భక్తులకు రాత్రి 8గంటలకు వందన డ్యాన్స్ అకాడమీచే సాంస్కృతిక కార్యక్రమం, కార్కెస్ట్రా, సత్యహరిశ్చంద్ర ఉచిత నాటక ప్రదర్శన, నందికోలు ఉత్సవం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు సౌకర్యవంతంగా చలువ పందిళ్లు, బారికేడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్ రెడ్డి తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించనున్నారు. విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

గుండెపోటుతో లెక్చరర్ మృతి



కమల్‌హాసన్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న బద్వేలు 7వ వార్డు చౌడమ్మవీధికి చెందిన పఠాన్‌కమల్‌హసన్(47) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. శనివారం ఉదయగిరిలో పరీక్ష విధుల్లో ఉండగా గుండెపోటు రావడంతో తోటి ఉద్యోగులు అక్కడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గానుగపెంటరమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేయండి

మైదుకూరు : ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయాలని మైదుకూరు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎంపీడీఓ అధ్యక్షతన గురువారం మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అనంతరం సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి సభలో ప్రస్తావించారు. ఎంపీపీ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా మండలంలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు.

అన్నదానం

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామానికి చెందిన క్లాస్–1 కాంట్రాక్టర్ మాచిరెడ్డి నాగిరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 24న మృతి చెందారు. ఆయన పెద్దకర్మ సందర్భంగా కుటుంబ సభ్యులు గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోడలు సత్యవతి, మనవడు విష్ణువర్ధన్‌రెడ్డి, మనవరాలు చందన, నాగిరెడ్డి కుమార్తె లక్ష్మీదేవి, బంధువులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే టీడీపీ సానుభూతి

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్
పులి సునీల్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న సునీల్, ఇండిపెండెంట్ పాస్టర్లు

కడప కార్పొరేషన్ : ఓట్ల కోసమే టీడీపీ నాయకులు క్రిష్టియన్ మైనార్టీలపై సానుభూతి చూపుతున్నారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇటీవల క్రిష్టియన్ మైనార్టీలతో సమావేశం నిర్వహించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా వర్గాలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీలపై ఎన్నో దాడులు జరిగాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దైవ సేవ చేస్తున్న పాస్టర్లు, అర్చకులు, మౌల్వీలకు గౌరవ వేతనం ఇస్తున్నారని గుర్తు చేశారు. క్రిష్టియన్ మైనార్టీలపై ఇంత ప్రేమాభిమానాలు చూపిస్తున్న జగన్నకు వారు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కిషోర్, పాస్టర్లు షద్రక్ రాజు, పీడీకే దాస్, ప్రేమానందం, జానయ్య, సుధీర్, శ్రీనివాసులు డేవిడ్ రాజ్, వినోద్, సజ్జన్ పాల్గొన్నారు.

- నేడు మహిళా దినోత్సవం

మహిళలకు



మహిళలు ఇంటికే పరిమితమయ్యే రోజులకు కాలం చెల్లాయి.
ప్రభుత్వ ఉద్యోగాలే కాదు.. ప్రజా ప్రతినిధులుగా ప్రజా సేవలో నడిచే రోజులొచ్చాయి.
గత టీడీపీ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి మంగళం పాడితే..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రభాగం ఇచ్చి అందలం ఎక్కించింది. ముందడుగు వేస్తున్నారు.

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలో ఐదు మండలాలు, ఒక మున్సిపాలిటీ ఉన్నాయి. ఇందులో 15 మంది మహిళలే కౌన్సిలర్లుగా ఉంటూ పరిపాలనలో చైర్మన్‌తోపాటు ఉంటూ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. గత ఐదేళ్లలో కనిపించని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుంది.

జెడ్పీటీసీలుగా.. ఉప ఎంపీపీలుగా

మైదుకూరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో మూడు జెడ్పీ స్థానాల్లో మహిళలే ఉన్నారు. మైదుకూరు జెడ్పీటీసీగా ప్రసన్న లక్ష్మీదేవి, చాపాడు జెడ్పీటీసీగా జేష్టాది రాజీ, ఖాజీపేట జెడ్పీటీసీగా దవనం పుష్పలతలు జెడ్పీలో తమ బాణీని వినిపిస్తున్నారు. వీరితో పాటు చాపాడు మండల ఉప ఎంపీపీలుగా శుభ కరుణమ్మ, సుందరమ్మలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సగభాగానికి మించి సర్పంచ్‌లు..

మైదుకూరు మండలంలో నలుగురు సర్పంచ్‌లు, చాపాడులో 12 మంది, ఖాజీపేటలో 12 మంది, దువ్వూరులో 15 మంది, బ్రహ్మంగారిమఠంలో 5 మంది.. ఇలా 48 మంది మహిళా సర్పంచ్‌లు పంచాయతీలలో పరిపాలనలో అందిస్తున్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
అమ్మ ఒడి	30,130	130.42
వసతి దీవెన	7,221	20.26
విద్యా దీవెన	7,094	36.59
వైఎస్సార్ ఆసరా	42,600	126.80
వైఎస్సార్ సున్నావడ్డీ	14,666	14.44
ఇంటి పట్టాలు	8,500	

బద్వేలులో..

అట్లూరు : మహిళలు గృహిణులు అనే మాటకు కాలం చెల్లిందని చెప్పవచ్చు. ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు పక్కన పెడితే ప్రజా సేవలో ప్రతినిధులుగా మహిళలు బద్వేలు నియోజకవర్గంలో ముందంజలో ఉన్నారు. అందుకు నిదర్శనం బద్వేలు ఎమ్మెల్యేగా డాక్టరు సుధా, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా గానుగపెంట రమణమ్మ కొనసాగుతున్నారు. బద్వేలు నియోజకవర్గంలో ఏడు మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీ ఉంది. ఏడు మండలాలకు సంబంధించి ఏడు మంది మండల అధ్యక్షులుగా మహిళలే కొనసాగుతున్నారు. 28 మంది ఎంపీటీసీలు, 46 మంది సర్పంచులుగా మహిళలు కొనసాగుతున్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
అమ్మ ఒడి	24,162	112.3
వసతి దీవెన	14,420	19.40
విద్యా దీవెన	15,294	52.44
వైఎస్సార్ ఆసరా	32,651	11.85
వైఎస్సార్ సున్నావడ్డీ	47,006	23.55
ఇంటి పట్టాలు	5,501	

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పురుషులకంటే మహిళా కౌన్సిలర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. 41 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు ఉండగా, వీరిలో 22 మంది మహిళలు పాలకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లుగా పందిటి సరోజమ్మ, ద్వార్శల భారతి, జంబాపురం వెంకటలక్ష్మి, ఎద్దుల జయంతి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, గరిశపాటి లక్ష్మీదేవి, మోపూరి రేవతి, చింతకుంట సరితారెడ్డి, కొవ్వూరు స్వాతి, షేక్ మెహనూరు, రాచమల్లు రమాదేవి, మోతుకూరి జయలక్ష్మి, మీగడ దీప్తి, బలిమిడి వెంకటలక్ష్మి, గాజుల శివజ్యోతి, పోసా వరలక్ష్మి, అలవలపాటి అరుణాదేవి, పల్లా రమాదేవి, రావులకొల్లు అరుణ, గంజికుంట రామసుబ్బమ్మతోపాటు కోఆప్షన్ సభ్యురాలుగా పాలగిరి నఫిసున్నీసా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో 50 శాతం మహిళలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శారద, రాజుపాళెం జెడ్పీటీసీ అంజనీకుమారి, ఎంపీపీ సలోమి మహిళా నేతలుగా ఉన్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
అమ్మ ఒడి	2,16,222	912.60
వసతి దీవెన	1,28,280	150.38
విద్యా దీవెన	1,40,934	378.75
వైఎస్సార్ చేయూత	1,04,325	546.43
వైఎస్సార్ ఆసరా	2,78,124	776.70
వైఎస్సార్ నేతన్న నేస్తం	10,591	91.08
ఇంటి పట్టాలు	23,900	

కన్వీనర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సిద్ధం కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : బూత్ కమిటీ కన్వీనర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3, 4, 36, 39, 40, 41 వార్డులకు గోల్డెన్ పార్కులో సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ అసెంబ్లీ కన్వీనర్ పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించాలని వలంటీర్లను కోరారు. పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. సాయంత్రం 30, 33, 34, 35, 37, 38 వార్డులకు భావనారుషి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సిద్ధం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పండిటి సరోజ, చింపిరి అనిల్ కుమార్, వరికూటి ఓబుళరెడ్డి, రెండో వార్డు ఇన్‌చార్జి ద్వార్శల భాస్కర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు గంజికుంట ఆంజనేయులు, రావులకొల్లు నాగేంద్ర, ఫరీద్, సచివాలయాల పట్టణ కన్వీనర్లు పోసా భాస్కర్, కాకర్ల నాగేశారెడ్డి, బండారు సూర్యనారాయణ, నాగులారపు జయసింహా పాల్గొన్నారు.

పట్టణ ప్రజల ప్రధాన తాగునీటి సమస్యను పరిష్కరించాం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలో ప్రధానంగా ప్రజలను పీడిస్తున్న తాగునీటి సమస్యను అధిగమించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన గొప్ప ప్రగతి అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం రూ.270 కోట్ల వ్యయంతో పట్టణంలో ప్రధాన కాలువల ఆధునీకరణ, రామేశ్వరంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.150 కోట్లతో అమృత్ పథకం ద్వారా మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరు నీటి శుద్ధి కేంద్రం వరకు పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్రతి రోజు తాగునీటిని అందించడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రగతి అని తెలిపారు. కొన్నేళ్లుగా తాగునీటి పైపులైన్లను మార్చకపోవడంతో అపరిశుభ్రత నీరు ప్రజలకు చేరుతోందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.163 కోట్లతో కొత్త పైపులైన్ ఏర్పాటుకు పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ సీఎస్ ఖాజామొహిద్దీన్, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, కాంట్రాక్టు కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక 24వ వార్డులో కౌన్సిలర్ షేక్ కమాల్ బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి, రాచమల్లు కిరణ్‌కమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వారు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అన్ని పథకాలను మహిళల పేర అమలు చేసిందని తెలిపారు. 24వ వార్డులో సంక్షేమ పథకాల ద్వారా రూ.22 కోట్లు ప్రజలు లబ్ధి పొందారని, రూ.కోటితో అభివృద్ధిపనులు చేశామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు రూ.1000 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా రూ.1700 కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్లు సీఎస్ ఖాజామొహిద్దీన్, పాతకోట బంగారు మునిరెడ్డి, 24వ వార్డు నాయకులు జమాల్, ఇస్మాయిల్, ఓబుళరెడ్డి, సోహెల్, మార్కాపురం సుజిత్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కౌన్సిలర్లు పాతకోట మునివంశీధర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జునప్రసాద్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం





మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి


ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన అత్యావసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ అజెండాలోని 8 అంశాలు, టేబుల్ అజెండాలోని 9 అంశాలను పొందుపరిచారన్నారు. ఇందులో ముఖ్యంగా గాంధీ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా బొల్లవరం నుండి రిషి అపార్ట్‌మెంట్ మీదగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల అనంతరం పనులు మొదలుపెడతామన్నారు. వార్డుల్లో మిగిలిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమైనా ఉంటే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులే ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సీఎస్ ఖాజామొహిద్దీన్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంఈ సాయికృష్ణ, డీఈ దస్తగిరి, ఏఈ ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

110 బస్తాల బియ్యం పట్టివేత

బద్వేలు అర్బన్ : పట్టణంలోని భాకరాపేట సమీపంలోని ఓ ఇంట్లో 110 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఈదురుబాషా తెలిపిన మేరకు ... భాకరాపేట సమీపంలోని ఓ ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని వచ్చిన సమాచారం మేరకు అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. 110 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన శ్రీనివాసులు, సునీల్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికా విద్యతోనే వివక్ష లేని సమాజం

మహిళా దినోత్సవ వేడుకల్లో
వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ప్రతి బాలిక ఉన్నత విద్యావంతురాలు కావాలని, తద్వారా వివక్ష లేని సమాజాన్ని సంపూర్ణంగా చూడవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలోని సురభి సమావేశ మందిరంలో గురువారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మహిళల ప్రగతి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్‌కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి. కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు వారి హక్కును సాధించి తీసుకోవాలన్నారు. మహిళల అభ్యుదయం కోసం రాజా రామ్మోహన్ రాయ్, వీరేశలింగం వంటి సంఘసంస్కర్తలు కృషి చేశారని తెలిపారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విశ్వవిద్యాలయాల పాలకమండలిలో 50 శాతం మందిని తీసుకున్నారని తెలిపారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రవేశించని రంగం లేదని, ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. పాలకమండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్ మాట్లాడుతూ ఉన్నత స్థలాల్లో నిలిచేందుకు మహిళలు ప్రయత్నించాలన్నారు. వైవీయూ మహిళా సెల్ సమన్వయకర్త ఆచార్య పి. రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవం వెనుక ఉన్న చరిత్రను సంక్షిప్తంగా వివరించారు. సమానం అనేది ఇంటి నుంచే అలవాటు కావాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.కాత్యాయని, డా.ప్రమీల మార్గరేట్, డా.ఎల్.దాక్షాయణి, కె.వేణి సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

మహిళలకు స్థిరాస్తిని అందజేసిన ఘనత జగనన్నదే



ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు పొందిన మహిళలతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పేదింటి మహిళల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు ఆ స్థలాలను మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి మహిళలకు విలువైన స్థిరాస్తిని అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా జగనన్న కాలనీల్లో ఇళ్లపట్టాలు పొందిన 5502 మంది లబ్ధిదారులలో 4435 మంది లబ్ధిదారులకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వాలు అతి తక్కువ సంఖ్యలో ఇచ్చిన ఇంటిపట్టాలకు కేవలం డి పట్టా మాత్రమే జారీ చేసిందని, దీని వలన వారికి ఎటువంటి ఉపయోగం ఉండేది కాదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న రిజిస్ట్రేషన్ పత్రాలతో మహిళలకు సంపూర్ణ హక్కులు అందుతాయని అన్నారు. ఈ పత్రాల ద్వారా మహిళలు బ్యాంకు, ఆర్థిక సంస్థల నుండి రుణాలు పొందే అవకాశంతో పాటు సేల్‌డీడ్స్‌గా వినియోగించుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుత్తా శ్రీరాములు, వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బాబ్జీ, మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బద్వేలు అర్బన్ : మహిళలు చట్టాలపైన, వారికి ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం వరకట్న నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం, పనిచేసే ప్రదేశాల్లో మహిళల రక్షణ చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి వివరించారు. సమావేశంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత సాధించే దిశగా పయనించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు సాధికారత సాధించే దిశగా పయనించాలని ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.హారిక తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని అరవింద ఆశ్రమంలో గురువారం లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఆర్.హారిక మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సంస్థ జిల్లా మహిళా విభాగం లీగల్ అడ్వైజర్ సీవీ జయలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్ప, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ చిప్పగిరి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో లోకా సమస్త హ్యూమన్‌రైట్స్ ఏపీ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.వీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

■ సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, న్యాయవాది సీవీ జయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : మాట్లాడుతున్న ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.హారిక

■ లేపాక్షి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ గౌతమి మహిళ ఇంజనీరింగ్ కాలేజీలో న్యాయవాది లక్ష్మీప్రసన్న, గైనకాలజిస్టు సుస్మిత పాల్గొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలే కీలకం

ప్రొద్దుటూరు : సమాజ నిర్మాణంలో మహిళలే కీలకమని ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హారిక తెలిపారు. వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం జడ్జి హారికను ఘనంగా సత్కరించారు.

చాపాడు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా పీహెచ్‌సీలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించి వైద్యురాలు కావ్యమాధురిని సన్మానించారు. అనంతరం ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్థానిక సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు.

మైదుకూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మైదుకూరు జెడ్పీటీసీ ఎ.ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

మల్లెంకొండకు చేరుకుంటున్న భక్తులు

గోపవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించే మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు మల్లెంకొండకు చేరుకుంటున్నారు. జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుండి భక్తులు వస్తారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం బద్వేలు ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కొండ దిగువ భాగం వరకు వాహనాల్లో చేరుకున్న భక్తులు అక్కడి నుండి దాదాపు 7 కిలోమీటర్ల మేర కాలినడకన కొండపైకి ఎక్కి వెళుతున్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం బి.మఠంలో ఉచితంగా పరీక్ష సామగ్రిని ఆదోని సీఐ లెక్కల విజయలక్ష్మి ఆధ్వర్యంలో అందించారు. డీఈఓ అనూరాధ, ఎస్ఎస్ఏ జిల్లా అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాం

ఖాజీపేట : పేదలకు ఇళ్లు నిర్మించుకోవడం ఒక కల. ఆ కలను నిజం చేసి నేడు అర్హత ఉన్న అందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాక నిర్మాణానికి సీఎం జగన్ సహాయం అందించారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో 906 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందించామన్నారు. ఒక్క మైదుకూరు నియోజకవర్గంలో 5 వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. చంద్రబాబు పాలనలో ఒక్కరికైనా పట్టా మంజూరు చేసి ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇళ్లు లేని వారు ఉండకూడదనేది సీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్ధిక్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు పీవీ రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకట లక్ష్మి, సర్పంచ్‌లు బుజ్జి, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గురురెడ్డి, ఎంపీటీసీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మున్వర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

మైదుకూరు : ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మైదుకూరు మున్సిపాలిటీలోని 19వ వార్డులో ఆయన గడప గడపకూ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



శంఖవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గురువారం శంఖవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, బూత్ అధ్యక్షులు పులివీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సింగరయ్య, షరీఫ్, రాంబాబు, కో కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

రాజుపాళెం : జరగబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని టంగుటూరు గ్రామంలో గురువారం సాయంత్రం రెండో రోజు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఆయన కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోనా రఘురామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, నవనీధర్‌రెడ్డి, వెంకటసుబ్బన్న, సుభాన్, సుబ్బయ్య, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఉప ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామ సచివాలయ పరిధిలో గురువారం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తెలిదేల లక్షుమయ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి సిద్ధం మెటీరియల్‌ను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లకు అందజేసి, ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల ప్రచారానికి కృషి చేస్తాం

గోపవరం : మహాకవయిత్రి మొల్లమాంబ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. తెలుగువారు గర్వించదగ్గ మొల్ల జన్మస్థలి గోపవరం మండల వెనుకబాటుతనాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని వారు హామీ ఇచ్చారు. గురువారం ఉదయం మహాకవయిత్రి మొల్ల సప్త శతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా గోపవరంలోని మొల్ల మందిరం వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

10న ప్రవేశ పరీక్ష

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల గ్రామంలో అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తులశమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి విద్యార్థినులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సమాచారం కోసం 9440534509 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందని డాక్టర్ హిమబిందు తెలిపారు. స్థానిక బొల్లవరంలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషాలిటి వైద్యులు గురు అభిలాష్, హేమంత్, హిమబిందు, అప్తాల్మిక్ ఆఫీసర్ ఎంఎస్ తేజలు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. 373 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, శౌరీసుబ్బారెడ్డి, వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ పాల్గొన్నారు.